వ్యవసాయ రంగానికి పెద్ద పీట

- అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్



గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసినప్పటికీ అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. సుమారు రూ.70 వేల కోట్ల నిధులను వ్యవసాయ రంగాలకు కేటాయిం చారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎక్కువ నిధులు కేటాయించారు. అన్ని వర్గాల ప్రజలు బడ్జెట్‌ను హర్షిస్తున్నారు.

అన్ని వర్గాల ఆమోదయోగ్యంగా బడ్జెట్

- డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే, జగిత్యాల



సమాజంలోని అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉండేలా ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్ పేద వాడి ఇంటి కల నెరవేర్చడమే కాకుండా, కడుపు నింపే విధంగా ఉంది. యువతకు ఉపాధి అవకాశాలు పెంచే విధంగా బడ్జెట్ రూపకల్పన చేశారు. రైతులు, మహిళలు, మైనార్టీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ ఫలాలు అందనున్నాయి.

సరియైన పాలసీ లేకుండా బడ్జెట్

- డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే, కోరుట్ల



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి అవగాహణ లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టారు. పెన్షన్‌ల గురించి మాట లేదు. రైతు భరోసా ప్రసక్తి లేదు. సరియైన పాలసీ లేకుండా బడ్జెట్‌ను రూపొందిచారు. అంకెల గారడీ మాదిరిగా బడ్జెట్ తయారయింది. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం బడ్జెట్ పెంపు ఉండాల్సి ఉండగా విస్మరించారు.

ఎన్‌డీఎస్‌ఎల్ పునరుద్ధరణ ప్రస్తావన సంతోషకరం

- తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, జగిత్యాల



మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో నిజాందక్కన్ షుగర్ లిమిటెడ్ కర్మాగారాల పునరుద్ధరణ గురించి ప్రస్తావించారు. రైతుల కళ నెరవేరేలా చర్యలు తీసుకుంటున్నారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో చేసే విధంగా బడ్జెట్ ఉంది. ఇంటి స్థలం ఉన్న పేదల సొంతింటి కళ, రైతు కూలీలకు ఆర్థిక సహాయం, ఆరు గ్యారెంటీల అమలుపై స్పష్టమైన ప్రస్తావన ఉంది.

నిరుత్సాహం నింపింది

- కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర సంక్షేమ శాఖ మాజీ మంత్రి, జగిత్యాల



అన్ని వర్గాల ప్రజలను మోసానికి గురిచేస్తూ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. వ్యవసాయ రంగానికి కేటాయించిన బడ్జెట్ సైతం నిరుత్సాహంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో అతీగతీ లేదు. గొప్పలు చెప్పుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించింది. ఆర్థిక మంత్రి ప్రసంగం రాజకీయ ప్రసంగంలా ఉంది.

తప్పుల తడక.. అబద్ధాల పుట్ట


- కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అబద్ధాల పుట్టగా తయారైంది. గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రజలకు అబద్దాలు చెప్పడం అలవాటుగా మార్చుకున్న కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం బడ్జెట్‌లోనూ అదే తరహాను కొనసాగించింది. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ప్రస్తావన బడ్జెట్‌లో లేదు.

బడ్జెట్‌పై భరోసా

- రైతు సంక్షేమానికి భారీగా నిధులు
- నెరవేరనున్న సొంతింటి కల
- నిజాం చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణపై ప్రకటన
- అన్ని వర్గాలకు ఊరట అంటున్న కాంగ్రెస్
- అంకెల గారడి అని కొట్టి పారేస్తున్న ప్రతిపక్షాలు



జగిత్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభలో గురువారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సర్వత్రా ఆసక్తిని నెలకొల్పింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క పలు వర్గాలకు భరోసాను కల్పిస్తూ బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జగిత్యాల జిల్లాకు లబ్ధి చేకూరనుంది. బడ్జెట్ వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయగా, ఇందులో సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు పెంచారు. గృహజ్యోతి, స్త్రీ, ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాల అమలు వంటివి జగిత్యాల జిల్లా ప్రజలకు మేలు చేకూ ర్చనున్నాయి. రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రసంగాన్ని చదివి వినిపించారు. గతంతో పోలిస్తే సాగు, సంక్షేమంలో స్వల్పంగా మెరుగు కనిపిస్తోందనే చర్చ జరుగుతోంది. పలు రంగాల ప్రజలను ఆకర్షించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఇదిలా ఉండగా జిల్లాలోని మల్లాపూర్ మండలం ముత్యంపేట, నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని బోధన్, మెదక్ జిల్లా ముంబోజుపల్లి నిజాందక్కన్ షుగర్ లిమిటెడ్ కర్మాగారాల పునరుద్ధరణ ప్రస్తావన బడ్జెట్ ప్రసంగంలో చేయడం అన్నదాతల్లో కొంత ఊరటనిచ్చింది. ఇది వరకే పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందిస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు బడ్జెట్‌లో కేటాయింపులు జరుపడంతో జిల్లాలోని ఇళ్లు లేని పేదలు ఇళ్లు వస్తాయనే ఆశలు పెంచుకున్నారు. బడ్జెట్‌పై జిల్లాలోని పలు వర్గాలకు చెందిన నాయకులు, ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

రాష్ట్ర ప్రగతికి నిదర్శనం

- తాటిపర్తి విజయ లక్ష్మీ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు,



రాష్ట్రప్రగతికి నిదర్శనంగా బడ్జెట్ రూపకల్పన జరిగింది. వ్యవసాయంకు ప్రాధన్యం ఇవ్వడం హర్షనీయం. వంటింటి భారం తగ్గించే విధంగా రూ.500కు సిలిండర్, జీరో కరెంట్ బిల్లుకోసం నిధులు కేటాయించారు. స్త్రీ, శిశు సంక్షేమం, మహిళా సంరక్షణకు పెద్దపీట వేశారు. అన్ని వర్గాల సంక్షేమానికి నిధులు కేటాయింపు జరిగింది.

అభివృద్ధి, సంక్షేమం రెండు గుర్రాలుగా బడ్జెట్

- బండ శంకర్, టీపీసీసీ కార్యదర్శి, జగిత్యాల



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఆర్థిక శాఖ భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉంది. అభివృద్ధి, సంక్షేమం రెండు గుర్రాలుగా ఉండేవిధంగా బడ్జెట్‌ను రూపొందించారు. అన్ని వర్గాలకు సామాన ప్రాధాన్యతనిచ్చారు. సాగు, తాగునీటి రంగాలకు నిధుల కేటా యింపు జరిగింది. ఇళ్ల నిర్మాణం, సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపు జరిపారు.

సామాన్యుల ఫ్రెండ్లీ బడ్జెట్

- మహంకాలి రాజన్న, సీనియర్ సిటిజన్, జగిత్యాల



సామన్యుల ఫ్రెండ్లీ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు. రైతు పక్షపాతిగా బడ్జెట్‌ను రూపొందిం చారు. నిరుపేదలకు భారంగా మారిన విద్యుత్ బిల్లు, గృహ జ్యోతి పథకాలకు కేటాయించిన బడ్జెట్‌తో సామాన్యులకు ఉపశమనం లభించింది.

అంకెల గారడీగా బడ్జెట్

- మోరపల్లి సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ఉంది. పలు ప్రభుత్వ శాఖలకు, సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్‌లో నిధుల కోత పెట్టారు. రుణమాఫీ సంపూర్ణంగా చేయాలన్న అన్న దాతల డిమాండ్‌ను పట్టించుకోలేదు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించే విదంగా బడ్జెట్ రూపకల్పన చేశారు.

నైపుణ్య కేంద్రాల ఏర్పాటు హర్షణీయం

- మ్యాన పవన్ కుమార్, సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



నైపుణ్య కేంద్రాల ఏర్పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో నిరుద్యోగులకు శిక్షణ, ఐటీఐ కళాశాలల అధునికీకరణ, స్కిల్ యూనివర్సిటీ ప్రస్తావన బడ్జెట్‌లో ఉండడం హర్షణీయం. రాష్ట్రంలోని ప్రతి యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల ఏర్పాటు కొరకు ప్రత్యేక నిధులు, పబ్లిక్ పాఠశాలల ఏర్పాటుతో పాటు పాత పెన్షన్ అమలు దిశగా ప్రభుత్వం ప్రయత్నించింది.

సంక్షేమానికి పెద్ద పీట

- బట్టు ప్రవీణ్, వ్యాపారి, జగిత్యాల



యువత, మహిళలు, రైతులు తదితర వర్గాల అభ్యున్నతికి తొలి ప్రాధాన్యమిస్తూనే బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. వ్యవసాయానికి తోడ్పాటు కొనసాగిస్తూనే అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పరిశ్రమల కల్పనకు అండగా నిలిచింది. అత్యధిక కుటుంబాలకు పథకాలు చేరువయ్యేలా బడ్జెట్‌ను రూపొందించార

పట్టణ అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలి

● కలెక్టర్ సత్య ప్రసాద్



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల టౌన్ , జూలై 25: జగిత్యాల పట్టణ అభివృద్ధికి నాయకులు, అధికారులు కలిసి సమష్టిగా కృషి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం వేకువజామున పారిశుధ్య పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. పట్టణ ప్రగతి నేపథ్యంలో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, కమిషనర్ సమ్మయ్య, శానిటేషన్ అధికారులు మారుతి తదితరులు ఉన్నారు.

కథలాపూర్ ఎంపీవోగా రాజశేఖర్

కథలాపూర్, జూలై 25: మండల పరిషత్ అధికారి (ఎంపీవో)గా రాజశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ప్రవీణ్ బదిలీపై మల్యాలకు వెళ్లగా రాజశేఖర్ గంభీరావుపేట నుంచి ఇక్కడికి వచ్చారు. మండల పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన తౌఖీర్ మేడిపల్లికి బదిలీ కాగా మెట్‌పల్లి నుంచి నరేందర్ కథలాపూర్‌కు బదిలీపై వచ్చారు.

ఆర్టిస్టుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న తాళ్లపల్లి రాజేశ్వర్

జగిత్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆర్టిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం చిత్రకళా చైతన్య యాత్రలో భాగంగా జగిత్యాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఆర్టిస్టుల సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చిత్రకళను నమ్ముకొని జీవిస్తున్న ఆర్టిస్టులను గత ప్రభుత్వాలు గుర్తించలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న డ్రాయింగ్ టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నాయకులు సీహెచ్ సత్య నారాయణ, కంకనాల సత్యనారాయణ, మాడిశెట్టి బాలకృష్ణ, విశ్వతేజ, మైదం మల్లేశం, యాదన్, మంజు రవి, బూస రాజు, తొగిటి సతీష్, కరీం, సలీం, రమేశ్, భాను, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బీర్‌పూర్ మండలంలో కస్తూర్బా పాఠశాల ఏర్పాటుకు చర్యలు

బీర్‌పూర్,జులై 25: మండలంలో కస్తూర్బా పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జీసీడీఓ అనుపమ తెలిపారు. పాఠశాల కోసం గురువారం బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో గల ఓ అద్దె భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సెక్టార్ ఆఫీసర్ అనుపమ మాట్లాడుతూ మండలంలో అతిత్వరలో కస్తూర్బా గాంధీ పాఠశాలను ప్రారంభించాలని అధికారుల ఆదేశాల మేరకు అద్దె భవణాలను పరిశీలించినట్లు తెలిపారు. ప్రస్తుతానికి బీర్‌పూర్ మండలానికి మంజూరైన కస్తూర్బా గాంధీ పాఠశాలలో 6వ, తరగతి, 7వ తరగతికి అడ్మిషన్లు జరిగాయని ప్రస్తుతానికి 35 మంది ఉన్నారని తెలిపారు. పూర్తి స్థాయిలో అద్దె భవణంలో తరగతులు ప్రారంభం అయ్యేనాటికి ఒక్కో తరగతికి 40 మంది విద్యార్థులు ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వాసం భీమయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలి

● ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, జూలై 25 : నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఆరు నెలల నేర సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రానున్న ఆరు నెలల్లో పోలీస్ అధికారులు మరింత ధృడ నిశ్చయంలో పనిచేసి జిల్లాను నేర రహిత జిల్లాగా మార్చేలా కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో గౌరవంగా వ్యవహరించి వారి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల భద్రతే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీలో కోర్టు డ్యూటీ అధికారులు అంకిత భావంతో పనిచేసి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుక తిరుగుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేస్తూ వరద ప్రమాదాల బారిన పడకుండా చూడాలన్నారు. గంజాయి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి వాటి మూలాలను అంతం చేయాలన్నారు. గుట్కా, అక్రమ ఇసుక రవాణా, పేకాట, గుడుంబా, రేషన్ బియ్యం తదితర అక్రమ వ్యాపారాలపై నిఘా పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు వినోద్ కుమార్, భీంరావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, రంగారెడ్డి తదితరులు ఉన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అశోకుమార్

జిల్లాలో పలు చోట్ల వర్షం

జగిత్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురు వారం పలుచోట్ల మోస్తారుగా వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సగటున 10.28 మిల్లీ మీటర్ల వర్షం పడింది. అత్యధికంగా మల్లాపూర్‌లో 20.5 మిల్లీ మీటర్లు, సారంగా పూర్‌లో 14.0, అత్యల్పంగా కొడిమ్యాల మండలం పూడూరులో 3.3, మల్యాల మండలం మద్దుట్లలో 3.3, కోరుట్లలో 12.8, మెట్‌పల్లిలో 11.5, మల్లాపూర్ మండలం రాఘవపేటలో 11.0, ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లిలో 10.5, రాయికల్‌లో 9.5, ఎండపల్లి మండలం గుల్లకోటలో 9.0, బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 8.5, పెగడపల్లి, జగిత్యాల మండలం పొలాస, ఇబ్రహీంపట్నం మండలం గోదూరులో 8.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అదేవిదంగా వెల్లటూరు, జగిత్యాలలో 7.8, రాయికల్ మండలం అల్లీపూర్ 7.3, బీమారం మండలం మన్నెగూడెం ఎండపల్లిలో 7.0, ధర్మపురి మండలం నేరేళ్లలో 6.8, బీమారం మండలం గోవిందారం, ధర్మపురి మండలం జైనా, గొల్లపల్లిలలో 6.5, బుగ్గారం మండలం సిరికొండ, కోరుట్ల మండలం అయిలాపూర్‌లలో 6.3, మేడిపల్లిలో 5.8, ఎండపల్లి మండలం మారేడుపల్లిలో 5.5, కొడిమ్యాల మం డలం తిరుమలాపూర్‌లో 5.3, కథలాపూర్, మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో 4.8, మల్యాలలో 4.5, మల్యాల మండలం మద్దుట్లలో 3.5, కొడిమ్యాల మండలం పూడూరులో 3.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

టీ హబ్ వద్ద పారిశుధ్య లోపం

● వరద , డ్రైనేజీ నీరు నిలువడంతో ఇబ్బందులు

జగిత్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ (టీ-హబ్) పరిసరాలు మురికి కూపంలా మారాయి. గత కొన్ని రోజులుగా వరుసగా కురుస్తున్న ముసురు వర్షాల వల్ల టీ - హబ్ పరిసరాల్లో వరద నీరు చేరింది. వరద నీటితో పాటు డ్రైనేజీ నీరు కలిపి దుర్గందభరితంగా మారింది. పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి నడవడానికి ఇబ్బందిగా మారింది. అలాగే రాత్రి సమయంలో పాములు సంచరిస్తుండటంతో టీ హబ్ పరిసరాల్లో విద్యుత్ బల్బులు లేకపోవడంతో టార్చ్‌లైట్ వెలుతురులో ఉద్యోగులు, స్థానికులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలంలో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే చోటే అస్తవ్యస్తంగా పారిశుధ్యం తయారైతే ఎలా అని కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





బురదమయంగా మారిన టీహబ్ పరిసరాలు

ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేష్‌నగర్, జూలై 25: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం పరీక్షల నియంత్ర అధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

చొప్పదండి, జూలై 25: చొప్పదండిలోని సంతోష్‌నగర్‌లో ఓవివాహిత ఇంట్లో ఉరి వేసుకొని గురువారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ అనూష కథనం మేరకు.. రాచకొండ మమత వివాహం 2019లో లక్ష్మణ్‌తో జరిగింది. పిల్లలు పుట్టడం లేదని దంపతుల మధ్య సంవత్సరం నుంచి గొడవలు జరుగుతున్నాయి. మమతను లక్ష్మణ్ వేధిస్తున్నాడని ఈనెల 8న తల్లిదండ్రులు మమతను పుట్టింటికి తీసుకుపోయారు. గురువారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని మమత ఆత్మహత్య చేసుకున్నట్టు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జగిత్యాలలో మూడిళ్లలో చోరీ

జగిత్యాల టౌన్, జూలై 25: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లిలో గురువారం తెల్లవారుజామున మూడు ఇళ్లలో చోరీ జరిగింది. గోవిందుపల్లి ప్రాంతానికి చెందిన ఎదురుగట్ల సతీష్‌తోపాటు మరో ఇద్దరి ఇళ్లల్లోకి దొంగలు చొరబడి ఇంటి, బీరువా తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. 15 తులాల బంగారంతోపాటు నాలు గు లక్షల రూపాయలు దోచుకెళ్లారు. నిందితులు తమ ఆనవాల్లు దొరకకుండా సీసీ కెమెరాలు, రూటర్లను ధ్వసం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించి కేసు నమోదు చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 25: కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. కరీంనగర్ లోని ఎల్ఐసీ ఏజెంట్ల సంఘ భవనంలో సీపీఐ ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణ శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు చెక్ పెట్టడంతో ఏన్డీఏ మిత్రపక్షాలు మోదీకి చెక్ పెట్టాయన్నారు. ఎన్డీఏ పక్షాలైన ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించి తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. 44 కార్మికచట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాశారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను గమనించిన ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పారన్నారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం విస్మరించిం దన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఈ దేశంలో అంతర్భాగమే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ ప్రజాస్వా మ్యాన్ని అపహాస్యం చేశారన్నారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేశారన్నార ని విమర్శించారు. భూ సమస్యలు పరిష్కరించలేదని, ప్రజలు కేసీఆర్ వైఖరిపై విసిగివేసారి గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించినప్పుడే ప్రజా విశ్వాసం పొందుతారన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు తక్షణమే అందించాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ ఇవ్వాలన్నారు. ధరణి పోర్టల్‌లో ఉన్న లొసుగులను సవరించి రైతుల భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆవిర్భవించి డిసెంబరు 25 నాటికి 100 సంవత్సరాలు పూర్తి అవుతుందన్నారు. సుదీర్ఘ పోరాటాల చరిత్రలో నిరంతరం, కార్మికులు, కర్షకులు, ప్రజల సమస్యల పరిష్కారమే ఏజెండగా ముందుకు సాగుతోందన్నారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రజా సంఘాలను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసుకోవడానికి రాజకీయ శిక్షణ శిబిరాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తాండ్ర సదానందం, వెన్న సురేష్, పొనగంటి కేదారి, గడిపె మల్లేష్, గోశిక మోహన్, కసిరెడ్డి మణికంఠరెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దోస్త్ ప్రత్యేక కౌన్సెలింగ్

గణేష్‌నగర్, జూలై 25: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దోస్త్ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రకటించారని దోస్త్ కో ఆర్డినేటర్ సూరేపల్లి సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందని విద్యార్థులు ప్రత్యేక కౌన్సెలింగ్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 2 వరకు రిజిస్ట్రేషన్, 27 నుంచి ఆగస్టు 3 వరకు వెబ్ ఆప్షన్స్, ఆగస్టు 6న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఆగస్టు 9లోగా రిపోర్టు చేయా లన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు దోస్త్ షెడ్యూ ల్ ప్రకారం ఈనెల 15 నుంచి ప్రారంభించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జ్యోతినగర్, జూలై 25: ఎన్టీపీసీ సుభాష్‌నగర్ సమీప రాజీవ్ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. రామగుండం వైపు నుంచి వస్తున్న ఆటో రోడ్డుపై ఉన్న గేదెను ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న బాదావత్ శేఖర్(35) తీవ్రంగా గాయపడ్డాడు. శేఖర్‌ను గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలిస్తుం డగా మార్గమధ్యలో చనిపోయాడు. రామగుండం ఎన్టీ కాలనీలో శేఖర్ నివాసం ఉంటున్నాడు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ప్రశాంత్‌కు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● కరీంనగర్‌లో వ్యాపారి..

కరీంనగర్ క్రైం: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్‌కు చెందిన వ్యాపారి తాటికొండ రమేష్ (49) మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. రమేష్ చొప్పదండిలో బుక్‌స్టాల్ నడుపుతూ కరీంనగర్ నుంచి రోజు చొప్పదండికి వెళ్లి రాత్రి తిరిగి కరీంనగర్‌కు వస్తుంటాడు. ఇదే క్రమంలో బుధవారం రాత్రి బుక్‌స్టాల్ మూసివేసి తన కారులో బయలుదేరిన రమేష్ నగునూర్‌లోని ఎస్సీఆర్ స్కూల్ వద్దకు రాగానే రోడ్డుపై పార్క్ చేసిన లారీని వెనక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో రమేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. రమేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'నీట్ నుంచి వైదొలుగుతున్నట్లు అసెంబ్లీలో తీర్మానం చేయాలి'

కరీంనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నీట్ నుంచి వైదొలుగుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేయాలని మాజీ ఎంపీ బోయినప ల్లి వినోద్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డిని ఒక ప్రకటనలో కోరారు. నీట్ ఎంట్రెన్స్ పరీక్ష మాత్రమేనన్నారు. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కర్ణాటక రాష్ట్రాలు నీట్ నుంచి వైదొలుగుతున్నట్లు వారి శాసనసభల్లో తీర్మాణాలు చేశాయని తెలిపారు. నీట్‌తో లాభం కంటే నష్టం ఎక్కువగా ఉందన్నారు. తెలంగాణలో పీజీ సీట్లు ఎక్కువ ఉన్నాయని, నీట్ ద్వారా విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా లక్ష ఎంబీబీఎస్ సీట్లు ఉంటే అందులో దాదాపు 10 శాతం 8,265 మంది విద్యార్థులు తెలంగాణలోనే ఉన్నారని చెప్పారు. నీట్‌పై అపనమ్మకం ఏర్పడిందని అన్నారు.

చింతన

మనిషి జన్మకు పరమార్థం ఏమిటన్నది చిరకాల ప్రశ్న. సమాధానాలు అనేకం ఉన్నా, 'ముక్తి సాధన' అనేది ఏ ఒక్కరూ కాదనలేనిది. దీనికి మరో పేరు 'మోక్ష ప్రాప్తి'. జనన, మరణ బంధం నుంచి విమోచన పొందడం అన్నమాట. అంటే, ఆ చక్రం నుంచే బయటపడటం. ఇది మాటలు, రాతలు కాదు... చేతలతోనే సాధ్యమవుతుంది. దీనికి ఏకైక మార్గం... ప్రతీ వ్యక్తి ఆత్మజ్ఞానం కలిగి ఉండడమే. ఎవరి గురించి వారు తెలుసుకోవాలంటే దైవశక్తినే సాధనంగా భావించాలి. తెలుసుకునే క్రమంలో మన ముందు నాలుగు మార్గాలు కనిపిస్తాయి.. అవన్నీ 'గ'కారంతో మొదలయ్యేవే. అంటే... 'గ'కార చతుష్టయం. అవి: గీత, గంగానది, గాయత్రీ మంత్రం, గోవింద నామం. నిత్యజీవితంలో వీటి స్మరణ మానవ జీవితానికి సార్థకత కలిగిస్తుందని భారతీయ సంస్కృతిని చాటి చెబుతోంది. అదే విషయాన్ని 'ఆత్మ నివేదనం' పేరిట విపులీకరిస్తోంది. 'నివేదన' అంటే 'సమర్పణ' అని అర్థం. మనసును, వాక్కును, కర్మను కేంద్రీకరించడం. ఈ కేంద్రీకరణ ద్వారానే స్వీయ పరిశీలన వేగవంతమవుతుంది.



ముక్తి సాధన కోసం...
గకార చతుష్టయం

చతుర్వేదాల సారాంశం

'గ'కార చతుష్టయంలో మొదటిది భగవద్గీత. ఇందులో ఉన్నదంతా వేద విజ్ఞాన సారం. వేదాలు నాలుగు. ఋుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వ వేదం. 'వేదం' అనేది 'విద్' (తెలియడం) నుంచి ఏర్పడింది.

ఋుగ్వేదం అంటే దేవ వేదమే. ఇందులోని కొన్ని సూక్తాలు పురాణాలను, సామాజిక వర్తనను వివరిస్తాయి. యజుర్వేదం యజ్ఞ నిర్వహణ రీతిని తెలుపుతుంది. మధురతకు సూచిక సామ వేదం. అంతేకాక, సకల జ్ఞాన ప్రదాయని. అథర్వ(ణ) వేదం ఆ ఋుషి పేరు మీదుగా వచ్చింది. ఇందులోనూ శాస్త్రీయ పరిజ్ఞాన వైభవం కనిపిస్తుంటుంది. చతుర్వేదాల సారాంశ సమాహారం కాబట్టే.. భగవద్గీతకు అంతటి ప్రసిద్ధి, విశిష్టత కలిగాయి.

వేదమాత

గాయత్రీదేవి వేదమాతగా ప్రశస్తి అందుకుంది. 'గయలు' అంటే ప్రాణాలు. 'త్రాయతే' అనే పదానికి పరిరక్షణ అని అర్థం. అందుకే ప్రాణ సంరక్షకురాలుగా గాయత్రిని ఆరాధిస్తారు. గాయత్రీ మంత్రంలోని "ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యమ్'ను పరిశీలిస్తే... 'ఓం (సర్వ రక్షణ), భూ (ఉనికి), భువ (జ్ఞాన రూపం), స్వ (ఆనంద స్వరూపం), తత్ (అటువంటి లక్షణ సమన్విత పరమేశుడు), సవితు (విశ్వ కర్త) వరేణ్యం (సర్వులతో ఆరాధనీయులు)' అనే భావార్థాలు ఇమిడి ఉన్నాయి. ఇవన్నీ సంప్రదాయ పరంగా, శాస్త్రీయంగా కూడా ప్రామాణికాలు.





అనంత ఫలప్రదం

ఇక గోవింద నామం... 'గకార చతుష్టయంలో దీని పాత్ర అనంతం. 'శ్రీనివాసా, శ్రీవేంకటేశా, నిత్య నిర్మలా, భక్త వత్సలా, దినకర తేజా' అని స్మరణలు చేస్తారు ఆరాధకులు. 'గోవింద' అంటే భూ పరిరక్షకుడు. వేదాల వల్ల ఘనతరుడనే అంతరార్థమూ ఉంది. గోవింద నామం అనంత ఫలప్రదం.

యోగవిద్యకు సంబంధించి సాధన చతుష్టయమనే మాట వినిపిస్తూ ఉంటుంది. వివేకంతో వ్యవహరించడం, యథాతథ స్థితిని గ్రహించగలగడం, సంపత్ లేదా సమతుల్యతను కోరుకోవడం, ఆత్మ జ్ఞాన ప్రాప్తికి పలు విధాలుగా ప్రయత్నించడం. ఇదంతా అభ్యాస సాధనాల క్రమం. వీటన్నిటి ఫలితంగా స్వయం పరిశీలన శక్తి విస్తారమవుతుంది. క్రమేణా ముక్తి ప్రాప్తికి మార్గం సులభతరంగా మారుతుంది.

మానసిక, నైతిక పరమోన్నత స్థితే ముక్తి. అంటే.. వ్యక్తి తన సహజత్వాన్ని పొందగలగడం. దీనికి మూలాధారం ఆత్మ నివేదన. దైవం పట్ల పరిపూర్ణ ప్రేమను వ్యక్తపరచే రీతి. భక్తి మార్గాలు ఎన్నో ఉంటాయి. వాటన్నిటికన్నా నివేదన విధానమే భగవంతుడిని, భక్తుడిని అనుసంధానిస్తుంది. పత్రం, పుష్పం, ఫలం, చివరికి నీటినైనా భక్తితో సమర్పిస్తే ప్రీతిగా స్వీకరిస్తానన్నది గీతాచార్యుడి మాట. నిజానికి మనిషి శరీరం ఆకు వంటిదే. రాలిపోతుందే తప్ప, శాశ్వతం కాదు. అందువల్ల పత్ర అర్చనకు ఆ వ్యక్తి సంసిద్ధం కావాలి. తన మనోవనంలోని మొగ్గను పుష్పంలా వికసింప చేయాలి. ఆ వికసిత పుష్పమే విజ్ఞాన ఫలంగా రూపాంతరం చెందడాన్ని సమర్పణగా వర్ణిస్తుంది మన భారతీయ ధార్మిక చింతన. పవిత్ర గీత, పావన గంగ, శక్తిదాయక గాయత్రి, స్ఫూర్తిప్రదాయ గోవింద స్మరణలకు మనను మనం సమర్పించుకుంటేనే జీవితాలకు ధన్యత. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భక్తి జ్ఞాన కర్మ యోగాదులు చాటి చెబుతున్నది ఇటువంటి ఆత్మ సమర్పణ పద్ధతినే.

• జంధ్యాల శరత్‌బాబు
99483 45013


భువనపావని...

యమున, కృష్ణా, గోదావరి, కావేరి, సింధు, నర్మదలతో పాటు సప్త నదుల్లో ఒకటి గంగ. 'భువన పావని', 'అనంత వాహిని' అనేవి దాని నామాంతరాలు. మన సంస్కృతి, చరిత్ర, వ్యవస్థ అంతా గంగానదితో మమేకమై ఉంది. గంగమ్మ తల్లిగా, గంగా భవానీగా పిలిచేది అందుకే. గంగను నీటికి పర్యాయపదంగా మనం ఉపయోగిస్తాం.. గంగ మరెన్నో నదులతో కలసి మహా ప్రవాహంగా మారుతుంది. ఆ జల స్నానం భారతీయులకు పరమ పవిత్రం. గంగా, యమున, సరస్వతీ నదుల సంగమ స్థలాన (త్రివేణి) కుంభ మేళాలు ఏర్పాటవుతుంటాయి. అలహాబాద్ (ప్రయాగ)లో ఈ మహోత్సవం వచ్చే ఏడాది జనవరిలో మొదలవుతుంది. ఇంతటి మేటి విశిష్టత కారణంగా... గంగ విశ్వ విఖ్యాతి పొందింది.

సుభాషితం

సజ్జన లక్షణాలు

ప్రదానం ప్రచ్ఛన్నం గృహ ముపగతే సంభ్రమవిధిః
ప్రియంకృత్వా మౌనం సదసి కథనం చాప్యుపకృతేః
అనుత్సేకో లక్ష్మ్యాం నిరభిభవసారాః పరకథాః
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారావ్రత మిదమ్



సజ్జనుల్లో సహజంగా ఉండే లక్షణాల గురించి 'నీతి శతకం'లో భర్తృహరి వివరించిన శ్లోకం ఇది. దీన్ని...

పొసగన్ దానము గుప్త మర్థి భవనంబు జేరుచో సంభ్రమో
ల్లసదుత్థానవిధానముం బ్రియవిధుల్ గావించి మౌనంబు రా
జసభన్ మిత్రకృత ప్రకాశనము గుత్సాకర్ష వైముఖ్య మీ
యసిధారావ్రతచర్య యెవ్వడు మహార్యశ్రేణికిం దెల్పెనో... అంటూ ఏనుగు లక్ష్మణకవి సముచిత రీతిలో తెలుగువారికి సమర్పించాడు.

భావం: దానాలు చేస్తున్నానని చాటింపు వేసుకోకుండా రహస్యంగా చేయడం. ఇంటికి వచ్చి యాచించిన వారిని ఆదరించడం. వేరొకరికి తను చేసిన మేలు గురించి ప్రచారం చేసుకోకపోవడం, వేరొకరు తనకు చేసిన మేలును పదిమందికీ చెప్పడం, ఎన్ని సంపదలు వచ్చినా వినయంగా ఉండడం, పరుల గురించి చెడ్డగా మాట్లాడకపోవడం... వీటన్నిటినీ పాటించడం కత్తిమీద సాములాంటిది. ఈ గుణాలు ఎవరో బోధిస్తేనో, నేర్పితేనో రావు. సజ్జనుల్లో ఈ లక్షణాలు స్వతస్సిద్ధంగా ఉంటాయి.

సద్బోధ

యోగి- సాధువు

పూర్వం ఒక యోగి అకుంఠితమైన తపస్సు చేసి, కొన్ని గొప్ప శక్తులను సంపాదించాడు. అతను స్వతహాగా మంచివాడు. కానీ తన శక్తులంటే అతనికి గర్వం ఉండేది. వాటిని ప్రదర్శించాలనే కోరిక ఉండేది. ఆ గర్వాన్ని తగ్గించాలని దేవుడు అనుకున్నాడు. ఒక రోజు... సాధువు రూపంలో ఆ యోగి దగ్గరకు వచ్చాడు. "స్వామీ! మీకు అద్భుతమైన శక్తులు ఉన్నాయని విన్నాను. మిమ్మల్ని దర్శించుకోవాలని వచ్చాను" అని అన్నాడు. మాటలు విన్న యోగి ఉప్పొంగిపోయాడు. మునిని సాదరంగా ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చాడు.

ఈలోగా అటువైపు ఒక ఏనుగు వెళుతోంది. సాధువు దాన్ని చూపిస్తూ "స్వామీ! మీరు కోరుకుంటే ఆ ఏనుగును చంపగలరా?" అని అడిగాడు.

"ఎందుకు చంపలేను? ఇదిగో చూడండి" అంటూ నేల మీద పిడికెడు మట్టి తీసుకున్నాడు యోగి. దాన్ని మంత్రించి ఏనుగు మీదకు విసిరాడు. ఆ ఏనుగు నొప్పితో విలవిలలాడుతూ నేల మీద పడి మరణించింది.

'చూశావా' అన్నట్టు గర్వంగా తలాడించాడు యోగి.


"మీ శక్తులు అమోఘం స్వామీ! మీరు ఏనుగును చంపేశారు. మరి దాన్ని మళ్ళీ బతికించగలరా?" అని అడిగాడు సాధువు.

"తప్పకుండా" అంటూ మరికాస్త మట్టి తీసుకొని, మంత్రించి, మరణించిన ఏనుగు మీద చల్లాడు యోగి. ఆ ఏనుగు లేచి నిలబడింది. శరీరానికి అంటుకున్న దుమ్మును విదిలించుకుంటూ అడవిలోకి నడిచింది.

"స్వామీ! మీకు అపారమైన శక్తులు ఉన్నాయి. కానీ నాకొక సందేహం ఉంది తీరుస్తారా?" అన్నాడు సాధువు.

"దానికేం? అడగండి" అన్నాడు యోగి.

"మీరు ఏనుగును చంపారు. దాన్ని మళ్ళీ బతికించారు. కానీ అందువల్ల మీకు కలిగిన ప్రయోజనం ఏమిటి? ఆధ్యాత్మికమైన ఉన్నతి కలిగిందా? మోక్షాన్ని, భగవంతుణ్ణి చేరే మార్గం దొరికిందా?" అని ప్రశ్నించాడు సాధువు.



ఆ మాటలకు యోగి దిగ్భ్రాంతి చెందాడు. సాధువు రూపంలో ఉన్న దేవుడు చిరునవ్వు నవ్వుతూ మాయమైపోయాడు. ఇంతసేపూ తన ముందు ఉన్నది సాక్షాత్తూ భగవంతుడేనని యోగికి అర్థమయింది. ఆ క్షణం నుంచి అతనిలో గర్వం, కోరికలు పూర్తిగా సమసిపోయాయి.

శ్రీ రామకృష్ణ పరమహంస తన శిష్యులకు ఈ కథ చెబుతూ "సూది బెజ్జానికి అడ్డుగా కంటికి కనిపించని చిన్న నలుసు ఉన్నా సరే... దానిలోంచి దారం వెళ్ళడం కష్టమవుతుంది. అదే విధంగా సాధకుల్లో ఇసుకరేణువంత కోరిక, గర్వం మిగిలి ఉన్నా... పరమాత్మ తత్త్వాన్ని గ్రహించలేరు. మోక్షపథాన్ని అందుకోలేరు" అని స్పష్టం చేశారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MNuqlklలో చదవండి.

బిజినెస్

టెక్ మహీంద్రా లాభంలో 23% వృద్ధి

క్యూ1లో రూ.851 కోట్లుగా నమోదు.. రూ.13,005 కోట్లకు తగ్గిన ఆదాయం



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ) టెక్ మహీంద్రా రూ.851 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి గడించిన రూ.692.5 కోట్ల లాభంతో పోలిస్తే, ఈసారి 23 శాతం వృద్ధి నమోదైంది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.2 శాతం తగ్గి రూ.13,005 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గినప్పటికీ, మొత్తం వ్యయాలు 2.3 శాతం తగ్గి రూ.955 కోట్లకు పరిమితం కావడం, వడ్డీ ఖర్చులు 40 శాతం తగ్గి రూ.715 కోట్లకు దిగిరావడం లాభాల్లో మెరుగైన వృద్ధికి దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మరింత మెరుగైన పనితీరు కనబర్చనుందని టెక్ మహీంద్రా కొత్త ఎండీ, సీఈఓ మోహిత్ జోషి అన్నారు.

- సేవల వ్యయం తగ్గడంతో క్యూ1లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ మరో 1.9 శాతం పెరిగి 12 శాతంగా నమోదైంది. ఇకపై లాభాల మార్జిన్ క్రమంగా పుంజుకోనుందని మోహిత్ జోషి అన్నారు.
- గడిచిన మూడు నెలల్లో కంపెనీ 53.4 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్‌ను కుదుర్చుకుంది. అయితే, ఐటీ రంగం ఇంకా అనిశ్చితిలోనే కొనసాగుతోందని, ఈ మధ్యనే చేపట్టిన పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళిక కంపెనీకి దోహదపడుతోందని జోషి పేర్కొన్నారు.

6,000 మంది ఫ్రెషర్ల నియామకాలు

గత మూడు నెలల్లో టెక్ మహీంద్రా ఉద్యోగులు నికరంగా 2,165 మంది పెరిగారు. దాదాపు 1,000 మంది ఫ్రెషర్ల నియామకాలతో పాటు బీపీఓ విభాగంలో మరింత మందిని చేరుకున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలనుకుంటున్నట్లు కంపెనీ ఇదివరకే ప్రకటించింది.

ద్వితీయార్ధంలో సిబ్బందికి వేతన పెంపు

తమ కంపెనీలో పనిచేస్తున్న 1.47 లక్షలకు పైగా ఉద్యోగులకు వేతనాన్ని పెంచాలనుకుంటున్నట్లు జోషీ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో (2024 అక్టోబరు-2025 మార్చి) పెంపు ఉంటుందని, ఇదే విషయాన్ని సిబ్బందికి తెలియజేయడం జరిగిందన్నారు. ఐటీ రంగ కంపెనీలకు ఉద్యోగుల జీతాలే ప్రధాన వ్యయం.

పసిడి పడుతోంది..

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు వరుసగా మూడో రోజూ తగ్గుముఖం పట్టాయి.ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం మరో రూ.1,000 తగ్గి రూ.70,650 స్థాయికి జారుకుంది. కిలో వెండి ఏకంగా రూ.3,500 తగ్గడంతో ధర రూ.84,000కు దిగివచ్చింది. అంతర్జాతీయంగా వీటి ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు దేశీయ బులియన్ మార్కెట్లోనూ జువెలర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. గడిచిన మూడు రోజుల్లో తులం బంగారం రూ.5,000 తగ్గింది. ఈ విలువైన లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని 6 శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించడంతో ఈనెల 23న గోల్డ్ రేటు ఏకంగా రూ.3,350 పడిపోయి రూ.72,300 స్థాయికి జారుకుంది. ఈ ఏడాదిలో అదే అతిపెద్ద తగ్గుదల. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒక దశలో 42.20 డాలర్లు తగ్గి 2,421 డాలర్ల స్థాయిలో ట్రేడవగా.. సిల్వర్ 28 డాలర్ల స్థాయికి పడిపోయింది.

మెటల్, బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాలు చవిచూశాయి. గురువారం ట్రేడింగ్ ఆరంభంలోనే 671 పాయింట్ల వరకు క్షీణించి 79,500 దిగువ స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. మళ్లీ క్రమంగా తేరుకుని చివరికి 109.08 పాయింట్ల నష్టంతో 80,039.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 203 పాయింట్ల మేర పతనమై 24,200 స్థాయికి జారుకుంది. చివర్లో 7.40 పాయింట్ల నష్టంతో 24,406.10 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో ఇన్వెస్టర్లు లోహం, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. మూలధన లాభాలపై పన్ను పెంచడంతో విదేశీ ఇన్వెస్టర్లు మన ఈక్విటీల నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడం కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.

30 నుంచి అకుమ్స్ డ్రగ్స్ ఐపీఓ: అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 30న ప్రారంభమై ఆగస్టు 1న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల బిడ్డింగ్ ధర శ్రేణిని కంపెనీ రూ.646-679గా నిర్ణయించింది. తద్వారా రూ.1,857 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది.

ఐపీఓకి స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.600 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.250 కోట్ల మొత్తానికి కొత్తగా రూ.10 ముఖ విలువతో కూడిన ఈక్విటీ షేర్లు జారీ చేయటం ద్వారా సమీకరించనుంది. మిగిలిన రూ.350 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా సమీకరించనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా 1.844 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు అవసరమైన స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్ పరికరాల తయారీలో కంపెనీ కీలకంగా ఉంది.

సైయెంట్ లాభంలో 17శాతం క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో సైయెంట్ రూ.1,414 కోట్ల రెవెన్యూపై రూ.141 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 2.8 శాతం, లాభం 17 శాతం క్షీణించాయి. కరెన్సీ మారకం ప్రభావం జూన్ త్రైమాసిక ఫలితాలపై పడిందని, దీంతో డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) వ్యాపారం క్షీణించిందని కంపెనీ పేర్కొంది. జూన్ త్రైమాసికంలో 5.24 కోట్ల డాలర్ల విలువైన ఆర్డర్లను కంపెనీ చేజిక్కించుకుంది. ఈ ఆర్డర్ల కారణంగా రానున్న త్రైమాసికాల్లో నిలకడైన వృద్ధిని కనబరచవచ్చని భావిస్తున్నట్లు సైయెంట్ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో సెమీకండక్టర్ విభాగంలోకి కంపెనీ అడుగుపెట్టిందని, ఇందుకోసం ప్రత్యేకంగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

48 శాతం తగ్గిన లారస్ ల్యాబ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి గాను లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ రూ.1,195 కోట్ల రెవెన్యూపై రూ.13 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 1 శాతం, లాభం 48 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో కీలకమైన సీడీఎంఓ క్లినికల్ ప్రాజెక్టుల్లో నిలకడైన పనితీరుతో పాటు అంకాలజీ ఏపీఐ, ఏఆర్‌వీ విభాగంలో పటిష్ఠమైన వృద్ధిని కనబరచటం కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. ఈ కాలంలో కంపెనీ సీడీఎంఓ-సింథసిస్ వ్యాపారం రూ.214 కోట్లుగా ఉండగా ఏపీఐ రెవెన్యూ రూ.664 కోట్లుగా ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,820 ▼	64,000 ▼	89,000 ▼
ముంబై	68,227 ▼	62,496 ▼	81,474 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ

హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	104	విజయవాడ	104
వరంగల్	104	గుంటూరు	107
కరీంనగర్	104	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	120
కర్నూలు	104	నెల్లూరు	120
విశాఖపట్నం	93	అనంతపురం	104
గోదావరి	104		

మ్యాన్‌కైండ్ గూటికి బీఎస్‌వీ

- ఒప్పందం విలువ రూ.13,630 కోట్లు
- అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి కొనుగోలు



న్యూఢిల్లీ: భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సిన్స్ (బీఎస్‌వీ)లో 100 శాతం వాటాను రూ.13,630 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మ్యాన్‌కైండ్ ఫార్మా గురువారం ప్రకటించింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి ఈ కంపెనీని చేజిక్కించుకుంది. బీఎస్‌వీ కోసం ఈక్యూటీ, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) కన్సార్షియం కూడా పోటీ పడినప్పటికీ అధిక ధరకు బిడ్డింగ్ వేయడం ద్వారా మ్యాన్‌కైండ్ ఈ సంస్థను హస్తగతం చేసుకుంది. బీఎస్‌వీ కొనుగోలు మ్యాన్‌కైండ్ వ్యాపారాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లనుంది. మహిళల ఆరోగ్యం, సంతాన సాఫల్య ఔషధాల మార్కెట్లో అగ్రగామిగా నిలపనుంది. అలాగే, క్రిటికల్ కేర్‌లో ఇతర ఉత్పత్తుల్లోకీ ప్రవేశం కల్పించనుంది. బయోఫార్మాస్యూటికల్స్‌లో ఐదు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన బీఎస్‌వీ.. మహిళ ఆర్యోగానికి సంబంధించి సంతాన సాఫల్యం నుంచి ప్రసవం తర్వాత సంరక్షణలో ఉపయోగించే పలు సంక్లిష్ట ఉత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తోంది. "మ్యాన్‌కైండ్ ప్రయాణంలో బీఎస్‌వీ కొనుగోలు కీలక మైలురాయి. మహిళల ఆరోగ్యం, ఫెర్టిలిటీ మార్కెట్లో తమను అగ్రసంస్థగా నిలబెడుతుంది. భవిష్యత్‌లో ఈ విభాగం అపార అవకాశాలు అందించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా బలమైన వ్యాపార వృద్ధికి బాటలు వేయనుందని భావిస్తున్నా"మని మ్యాన్‌కైండ్ ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ రాజీవ్ జునేజా అన్నారు.

పిట్టీ ఇంజనీరింగ్ చేతికి దక్షిణ్ ఫౌండ్రీ

డీల్ విలువ రూ.153 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ (డీఎఫ్‌పీఎల్)లో 100 శాతం వాటాలను రూ.153.12 కోట్లకు కొనుగోలు చేసినట్లు పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. డీఎఫ్‌పీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న పదిహేను రోజుల్లో ఈ డీల్‌ను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి డీఎఫ్‌పీఎల్ వద్ద రూ.42.71 కోట్ల నగదు, బ్యాంక్ బ్యాలెన్స్ ఉంది. డక్టైల్ ఐరన్, గ్రే ఐరన్, లో కార్బన్ అల్లాయ్ స్టీల్ గ్రేడ్స్, సిమో ఐరన్ కాస్టింగ్స్ తయారీలో డీఎఫ్‌పీఎల్ కీలకంగా ఉంది. బెంగళూరు, హోస్కోట్‌లో ఏటా 4,200 టన్నుల స్థాపిత సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్లను నిర్వహిస్తోంది. డీఎఫ్‌పీఎల్ కొనుగోలుతో పిట్టీ ఇంజనీరింగ్ ఉత్పత్తి సామర్థ్యపరంగా మరింత బలోపేతం కానుందని సంస్థ ఎండీ అక్షయ్ ఎస్ పిట్టీ తెలిపారు.

స్థిరాస్తుల అమ్మకాల లాభాలపై కొత్త కొర్రీ

- వడ్డీ, స్టాంప్ డ్యూటీలు ఖర్చులు యథాతథం

న్యూఢిల్లీ: స్థిరాస్తుల అమ్మకాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) తగ్గించామని చెబుతూనే.. ప్రభుత్వం పెద్ద బాంబు పేల్చింది. ఈ లాభాల లెక్కింపు కోసం ఆస్తుల కనీస విలువను లెక్కించేటప్పుడు, వాటిని కొనేటప్పుడు చెల్లించే స్టాంప్ డ్యూటీ, అప్పు చేసి కొంటే.. ఆ అప్పులపై చెల్లించే వడ్డీల భారం.. ప్రస్తుతం ఉన్న విధంగానే లెక్కింపులోకి రాదని స్పష్టం చేసింది. కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా గురువారం ఈ విషయం వెల్లడించారు. కొత్త ఎల్‌టీసీజీటీ విధానంలోనూ ఇదే పద్ధతి కొనసాగుతుందన్నారు. దీంతో ద్రవ్యోల్బణం ఆధారంగా లెక్కించే ఇండెక్సేషన్ ఖర్చుల ప్రయోజనం రద్దయి, స్థిరాస్తుల దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను భారం 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గినా అమ్మకందారులకు పెద్దగా ప్రయోజనం లేదని భావిస్తున్నారు.

కెనరా బ్యాంక్ లాభం రూ.3,905 కోట్లు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ ముగిసిన త్రైమాసికంలో రూ.3,905 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,535 కోట్లతో పోల్చితే లాభం 10 శాతం పెరిగింది. మొండి బకాయిలు తగ్గడం ఇందుకు దోహదపడింది. కాగా బ్యాంక్ త్రైమాసికాదాయం రూ.29,823 కోట్ల నుంచి రూ.34,020 కోట్లకు పెరిగింది. వడ్డీల ద్వారా జూన్ త్రైమాసికంలో రూ.28,701 కోట్లు ఆదాయం లభించింది. నికర వడ్డీ ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.8,666 కోట్ల నుంచి రూ.9,166 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ మాత్రం 3.05 శాతం నుంచి 2.90 శాతానికి తగ్గింది. భవిష్యత్తులో ఎన్ఐఎం మెరుగుపడి 2.95 శాతం వద్ద స్థిరపడుతుందని భావిస్తున్నట్టు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు చెప్పారు. ఆస్తుల నాణ్యత విషయానికి వస్తే బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 5.15 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 1.57 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.2,418 కోట్ల నుంచి రూ.2,171 కోట్లకు తగ్గాయి. బ్యాంక్ సీఆర్ఏఆర్ (క్యాపిటల్ అడిక్వసీ నిష్పత్తి) 16.28 శాతానికి పెరిగింది. ప్రొవిజన్ కవరేజి నిష్పత్తి (పీసీఆర్) 118 బేసిస్ పాయింట్లు పెరిగి 89.22 శాతానికి చేరింది. ఈ ఏడాది చివరికి పీసీఆర్ 90 శాతం దాటాలని బ్యాంక్ భావిస్తున్నదని రాజు చెప్పారు. ప్రతి త్రైమాసికంలోనూ రూ.1,000 కోట్ల మొండి బకాయిలు వసూలు చేయాలన్నది తమ లక్ష్యమన్నారు.

రూ.8,500 కోట్ల సమీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.8,500 కోట్ల నిధులు సమీకరించేందుకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు అనుమతించిందని ఎండీ తెలిపారు. టియర్ 1, టియర్ 2 బాండ్ల ద్వారా ఈ నిధులు సమీకరిస్తామన్నారు. అలాగే తమ అనుబంధ సంస్థలు కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, కెనరా రొబెకో ఏఎంసీ రెండింటిలోనూ 25 శాతం వంతున వాటాలు విక్రయించాలని నిర్ణయించినట్టు రాజు వెల్లడించారు.

నాణ్యత పాటించని హోటళ్లకు జరిమానా

జగిత్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల విక్రయాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించని పలు హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులకు జరిమానా విధించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్, కిరాణం, బేకరీలలో సాధారణ తనిఖీలు చేపట్టి, అనుమానంగా ఉన్న పలు హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి ఫుడ్ శాంపిళ్లు సేకరించామన్నారు. సంబంధిత శాంపిళ్లపై ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం నాణ్యత ప్రమాణాలు తక్కువగా ఉన్నట్లు తేలిందన్నారు. సంబంధిత ఏడు గురు వ్యాపారులకు కలిపి రూ.6.35 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు.

ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని వినతి

రాయికల్, జూలై 25: రాయికల్ పట్టణంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు గురువారం మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లుకు వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని పెద్ద చెరువు వద్ద పార్క్ కోసం చదును చేసిన స్థలంలో చెట్లు పెట్టి, క్రీడా పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. పెద్ద చెరువు, ప్రభుత్వ ఆస్పత్రి, జగిత్యాల రోడ్‌లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్ కుమార్, కౌన్సిలర్లు మారంపెల్లి సాయి కుమార్, వల్లకొండ మహేష్‌గౌడ్, శ్రీరాముల సువర్ణ పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి రెయిన్ కోట్స్ పంపిణీ

రాయికల్, జూలై 25: రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందితో పాటు పారిశుధ్య కార్మికులకు గురువారం మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కమిషనర్ చిరంజీవిలు రెయిన్ కోట్స్ పంపిణీ చేశారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని రెయిన్ కోట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటి, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన రేషన్ బియ్యం అందించాలి

మెట్‌పల్లి, జూలై, 25: రేషన్ షాపులకు నాణ్యతతో కూడిన బియ్యం అందించడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రేషన్ డీలర్లు గురువారం కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావుకు వినతిపత్రం అందజేశారు. రేషన్ షాపులకు ముక్కిపట్టిన బియ్యం అందించడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. నర్సింగరావు స్పందించి సివిల్ సప్లయ్ డీఎంకు ఫోన్‌చేసి నాణ్యమైన బియ్యం అందించాలని కోరినట్లు తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు


కొడిమ్యాలలో కూలిన ఇల్లు

కొడిమ్యాల, జూలై 25: నాలుగు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షానికి గురువారం మండల కేంద్రానికి చెందిన ముమ్మాడి భాగ్యలక్ష్మి ఇల్లు గోడ, పైకప్పు కొంత కూలింది. డబ్బు తిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన నేదూరి పోచయ్య ఇల్లు బుధవారం పాక్షికంగా కూలింది.

సామూహిక కుంకుమ పూజలు


పూజలు నిర్వహిస్తున్న మహిళలు

జగిత్యాల టౌన్, జూలై 25: జగిత్యాలలోని వాసవీ కన్యాకా పరమేశ్వరి దేవాలయంలో గురువారం భక్తుల ఆధ్వర్యంలో అనఘాష్టమి వ్రత వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుడు వేణు గోపాలశర్మ ఆధ్వర్యంలో సుమారు 500 మందికి పైగా మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జువ్వాడిని కలిసిన పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు

కోరుట్ల, జూలై 25: కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావును గురువారం పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసారు. వచ్చే శుక్రవారం పట్టణంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బోనాల జాతరలో పాల్గొనాలని కోరారు. పద్మశాలి సంఘ భవన అభివృద్ధికి నిధులు మంజూరుకి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా పట్టణంలోని 33వ వారు కౌన్సిలర్ రుద్ర సుజాత ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించే విధంగా చొరవచూపాలని కోరినట్లు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్య నేర్చుకోవాలి

మెట్‌పల్లి రూరల్, జూలై, 25: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను నేర్చుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి అన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తున్న నోటుబుక్స్ పెన్నులు గురువారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని ప్రభుత్వం పాఠశాలల్లోని పేద విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్, శోభన్‌రెడ్డి, చిన్నరెడ్డి, చింటూ, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

కథలాపూర్, జూలై 25 : మండలంలోని గంభీర్‌పూర్, దుంపెట గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలను గురువారం వేములవాడ ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. దుంపెటలో మాజీ ఉపసర్పంచ్ ఆకుల స్వామి, గంభీర్‌పూర్‌లో జవ్వాజి కాశవ్వ అనే మహిళ మృతి చెందగా వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వెలిబుచ్చారు ఈ సందర్భంగా జడ్పీటీసీ నాగం భూమయ్య, మాజీ ఎంపీటీసీ మల్యాల రమేశ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, మాజీ సర్పంచ్ జెల్ల వేణుగోపాల్, పోతు శేఖర్, జలందర్ తదితరులు ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కొడిమ్యాల, జూలై 25 : మండలంలోని తిర్మలాపూర్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విద్యార్థులు ఒగ్గు కథ, నాటికలను ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయురాలు జ్యోత్స్నదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెగడపల్లి ఎస్‌ఐగా రవికిరణ్



పెగడపల్లి, జులై 25: పెగడపల్లి ఎస్‌ఐగా సీహెచ్.రవికిరణ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్‌ఐగా విధులు నిర్వహించిన రామకృష్ణను బదిలీ చేసి రవికిరణ్‌ను నియమించగా ఈ మేరకు గురువారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

స్పీకర్‌ను కలిసిన నాయకులు


స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసిన మాజీ మంత్రి రాజేశం గౌడ్ తదితరులు

జగిత్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన నాయకులు గురువారం అసెంబ్లీ ఆవరణలో కలిసారు. జగిత్యాల జిల్లాకు చెందిన మాజీ మంత్రి రాజేశంగౌడ్‌తో పాటు ఇతర నాయకులు మాజీ శాసన సభ్యుల సంఘం తరఫున స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సుద్దాల దేవయ్య, నేరెళ్ల అంజనేయులు, మాజీ ఎమ్మెల్యేలు సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్, డాక్టర్ నగేశ్, సంజీవ్‌రావు తదితరులు ఉన్నారు.

సారంగాపూర్ మండలంలో కలెక్టర్ తనిఖీ


సారంగాపూర్ కస్తూర్బా పాఠశాలలో సరుకులు పరిశీలిస్తున్న కలెక్టర్

సారంగాపూర్, జూలై 25 : సారంగాపూర్ మండలంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి సేవలను మెరుగు పరచాలని వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులను కోరారు. ఇప్పటి నుంచే పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. స్టోర్ రూమ్‌లో ఉన్న వంట సరుకులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధు సుధన్, తహసీల్దార్ రమేష్, ఆర్‌ఐలు క్రిష్ణ, బాస్కర్‌రావు తదితరులు ఉన్నారు.

బీర్‌పూర్ తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

బీర్‌పూర్: రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రైతులకు రుణమాఫీ జరుగుతుందని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ధరణి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని, కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని అన్నారు. కార్యాలయం సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని, ఆఫీసు పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రం చేసి శానిటేషన్ చేయాలని తెలిపారు. అనంతరం రైతులకు సంబంధించిన రైతు రుణమాఫీపై ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రుణాలు మాఫీ జరుగుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విదేశాలకు వెళ్లి రేషన్‌కార్డులో పేర్లు లేక రుణాలు మాఫీ కాని వారు ఆందోళన చెందవద్దని సూచించారు. అటువంటి వారి విషయంలో వ్యవసాయ అధికారులు సర్వేచేసి రేషన్ కార్డులో ఉన్న కుటుంబంలో వ్యక్తులలో ఎవరి పేరుమీద ఎంతవరకు పంట రుణం ఉన్నది అనే అంశాలపై పరిశీలించి కుటుంబం మొత్తానికి రెండు లక్షల రుణ మాఫీ అయ్యే విధంగా అధికారులు చూస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనవెంట జగిత్యాల ఆర్డీఓ మధుసుధన్, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ లచ్చాలు ఉన్నారు.

విద్యా రంగానికి కేటాయింపులు పెంచాలి

- టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్, భూమేశ్వర్

జగిత్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయింపులు పెరిగినప్పటికీ, సరిపోయే విధంగా లేవని, పునఃసమీక్ష జరిపి మరింత పెంచాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుక్కోవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్‌లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. పలు పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, నూతన భవనాలు నిర్మించాల్సిన అవసరముందన్నారు. టాయిలెట్లు, తాగునీటి వసతులు కల్పించాలని, అల్పాహారం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడానికి నిధులు కేటాయించాలన్నారు. పాఠశాలల్లో ఉచిత విద్యుత్ అమలు, సర్వీసు పర్సన్ల నియామకం బడ్జెట్‌లో లేకపోవడం విచారకరమన్నారు. అంగన్‌వాడీల్లో ప్రాథమిక తరగతులను విలీనం చేయడం వల్ల పలు ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. పాఠశాల విద్యలో సంస్కరణలు చేసే ముందు క్షేత్ర స్థాయిలో ప్రధాన భాగస్వామ్యులైన తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించి పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కథలాపూర్, జూలై 25: కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ యోగిత కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 18 నుంచి 59 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న రైతులు రైతుబీమాకు అర్హులని పేర్కొన్నారు. ఆగస్టు 5లోపు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, నామినీ ఆధార్‌కార్డు, రైతుబీమా దరఖాస్తుకు జతపరచి ఏఈఓలకు అందించాలని సూచించారు. గతంలో రైతుబీమా ఉన్నవారి ఏదైనా మార్పులు ఉంటే ఆధారాలు సమర్పించాలన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెల మృతి

కథలాపూర్, జూలై 25: మండల కేంద్రంలోని వరద కాలువ సమీపంలో విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతి చెందాయి. మాచర్ల రాజేందర్, దానవేని రాజమల్లయ్యలు తమ గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. మేతకు వెళ్లే క్రమంలో స్తంభం సపోర్ట్ వైరు తగలడంతో విద్యుదాఘాతంతో మృతి చెందాయి. ఈ ఘటనలో సుమారు రూ 30వేల నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

కథలాపూర్, జూలై 25 : మండలంలోని తాండ్ర్యాలలో కొమ్ముల లింగవ్వ అనే మహిళకు మంజూరైన రు. 24 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును గురువారం కాంగ్రెస్ నాయకులు అందించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషి మేరకు నిధులు మంజూరైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఉరుమల్ల చారి, నర్సయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు


జైనాలో బోనాల వేడుకలు

ధర్మపురి, జూలై 25: ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో పోచమ్మ బోనాలు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జోగిని రేణుక నెత్తిన బోనాలు పెట్టుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా సమీపంలో గల పోచమ్మ ఆలయానికి బయలు దేరారు. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో పోచమ్మ, మారెమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతకాని సంఘం నాయకుల గడ్డి రాజన్న, పెరుగు గంగలక్ష్మి, దుర్గం బుచ్చన్న, గడ్డి అభి, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుల చిలుముల లక్ష్మణ్ పాల్గొన్నారు.

● కోరుట్ల : పట్టణంలోని ఎసికోని గుట్ట ప్రాంతంలో గురువారం పోచమ్మ బోనాల జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులు పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించంగా మహిళలు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు కాలనీలోని పురవీధుల గుండా బోనాల శోభయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, నాయకులు కొంతం రాజం, అడెపు మధు, పుప్పాల ప్రభాకర్‌లు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

● మెట్‌పల్లి: గ్రామ దేవత పోచమ్మ తల్లి చల్లగా చూడాలంటూ బోనాల పండుగను మనుమయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని పురవీధుల గుండా మహిళలు బోనం ఎత్తుకొని ఆలయం వద్దకు బయలుదేరారు. భక్తులు బోనంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మ వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మనుమయ సంఘం అధ్యక్షుడు పులిమామిడి చంద్రయ్య, కార్యదర్శి సుద్దుల హన్మండ్లు, సుతారి రవీందర్, లక్ష్మణ్, గోవర్ధనచారి వెంకన్న, దేవయ్య, చిన్నయ్య, నవీన్, నాగభూషణం, రాజేందర్, దామోదర్, లక్ష్మీరాజాం పాల్గొన్నారు.

● మెట్‌పల్లి రూరల్ : మండలంలోని చౌలమద్ది గ్రామంలోని శ్రీవెంకటేశ్వర సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచే గ్రామంలోని పోచ్చమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు బోనంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మ వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, జెట్టి లింగం, వాసాల రాములు, రేగుంట రాజు, అలలా రాజు, వాసాల వినయ్, ప్రసాద్, శేఖర్, శ్రీనివాస్, నరేష్, రవి, లక్ష్మిరాజాం, గట్టయ్య, శ్రీనివాస్, మురళీ, గంగారాం, చిన్నయ్య, చందర్, హరీష్, వెంకీ, రాజు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

- కలెక్టర్ సత్యప్రసాద్‌కు కోరుట్ల కాంగ్రెస్ నేతల వినతి


కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ కలెక్టర్ సత్య ప్రసాద్‌కు ధర్మపురి దేవస్థాన అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్, కోరుట్ల కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు వినతిపత్రం అందించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి వినతి చేశారు. అదేవిదంగా కోరుట్ల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి మహేందర్‌రెడ్డి, తిరుమల గంగాధర్, కొంతం రాజం ఉన్నారు.

కోటిలింగాల వద్ద గోదావరిలో పెరుగుతున్న వరద

వెల్గటూర్‌జులై 25: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. గురువారం సాయంత్రం కడెం ప్రాజెక్టు 2 గేట్లు ఎత్తి 13,611 క్యూసెక్కుల నీటిని కిందికి వదలడంతో కోటిలింగాల వద్ద గోదావరిలోకి వరద చేరుతోంది. దీనితో ఎల్లంపెల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పెరుగుతోంది. శ్రీ కోటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా స్నాన ఘట్టాల ఎత్తు పెంచడంతో ఆలయం మెట్ల వరకు నీరు చేరలేదు. వరద నీటితో గోదావరి నిండు కుండలా మారింది. నదీ పరివాహక ప్రాంతంలోకి జాలర్లు, పశువుల కాపర్లు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. గోదావరిలో పుణ్య స్నానాలు చేయడానికి వస్తున్న భక్తులకు లోతైన ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కోరుట్ల రూరల్, జూలై 25 : పట్టణంలోని బీలాల్‌పుర ప్రాతంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంను గురువారం జిల్లా వెల్ఫేర్ అధికారి నరేష్ ఆకస్మితిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిలువ ఉన్న సరుకుల వివరాలను పరిశీలించి వాటికి సంబధించిన రికార్డులను తనీఖీ చేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లడాలూ గర్భిణిలకు కిశోర బాలలకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ వివరాలను సక్రంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ ప్రేమలత, అంగన్‌వాడి టీచర్ సాయిఈశ్వరిలతో పాటు పలువురు ఉన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

రాయికల్, జూలై 25: మండలంలోని లోక్యానాయక్ తండాలో గురువారం బంజారా సంప్రదాయమైన తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు పెళ్లికాని ఆడపడుచులు 8 రోజులు గోధుమలను నానబెట్టి నీరు పోస్తూ ఉపవాసంతో కొలిచిన అనంతరం నారు మొలిచాక చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆడ పిల్లలు ఆరోగ్యంగా ఉండి ఉన్నత స్థాయికి ఎదగాలని, మంచి భర్తను పొందాలని పెళ్లి కాని ఆడ పిల్లల ప్రత్యేక పండుగ ఇది. ఈ కార్యక్రమంలో తండా నాయక్, భూక్య అర్జున్ నాయక్, కార్బారీ లావుడ్యా, కెవుడియా నాయక్, అజ్మీర మంగ్యా నాయక్, మాజీ సర్పంచ్ భూక్య భూక్య బంగారి, నునావత్ రాజు నాయక్, మాలవత్ రాజు నాయక్, భూక్య మురళి నాయక్, నునావత్ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్‌లో బ్యాంకుల వద్ద రద్దీ

వెల్గటూర్, జూలై 23: రుణమాఫీ నేపథ్యంలో వెల్గటూర్ మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లు రైతులతో రద్దీగా మారాయి. ప్రభుత్వం లక్ష రూపాయల రైతురుణ మాఫీ ప్రకటించిన నేపథ్యంలో రైతులు బ్యాంక్‌ల వద్ద బారులు తీరుతున్నారు. తమ రుణ మాఫీకి సంబంధించి సమాచారం తెలుసుకోవడం కొరకు బ్యాంక్‌లకు చేరుకొని వివరాలు తెలుసుకుంటున్నారు. రుణం మాఫీ కాని వారు తగిన పత్రాలు చేత పట్టుకొని బ్యాంకులకు వస్తున్నారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ అధికారులు, నాయకులు

ధర్మపురిలో వన మహోత్సవం

ధర్మపురి, జూలై 25: ధర్మపురి పట్టణంలోని 1, 2వ వార్డుల్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, వార్డు కౌన్సిలర్ అయ్యోరు వేణుగోపాల్, మున్సిసల్ సిబ్బంది, మెప్మా ఆర్‌పీలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

కోరుట్ల, జూలై 25: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీజేవైఎం నాయకులు ఆందోళన చేసారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ, బీజేవైఎం నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, గృహలక్ష్మి పథకంలో మహిళలకు రూ. 2500 ఆర్థిక సహాయం అందించాలని, పాత పెన్షన్ వచ్చే వారికి రూ. 2500 పెంచిన రేషన్ ప్రకారం రూ. 4500 అందించాలని డిమాండ్ చేశారు. గృహజ్యోతి పథకం రేషన్ కార్డు ఉన్న లేనివారికి కూడా అమలు చేయాలని, నిరుద్యోగులకు వెంటనే నాలుగు వేల నిరుద్యోగ భృతి కల్పించాలని, బీడీ కార్మికులను ప్రభుత్వం ఆదుకుని వికలాంగులతో పాటు వారికి కొత్త పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

● అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి


సత్తక్కపల్లి పాఠశాలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్


బుగ్గారంలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న జిల్లా మార్కెటింగ్ అధికారి

మెట్‌పల్లి రూరల్, జూలై, 25: గ్రామాల్లో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని సత్తక్కపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నిర్వహించిన అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపట్టిన పనులు పరిశీలించారు. పాఠశాలలో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయించాలని ఇంచార్జి ఎంపీడీవో రామకృష్ణను ఆదేశించారు. పాఠశాలలో పేరుకపోయిన చెత్తను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాల్లో శానిటేషన్ పనులు ప్రతిరోజు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంను సందర్శించి ప్రజా పాలనలో స్వీకరిస్తున్న దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని క్యాదర్శులతో సమీక్ష నిర్వహించారు.

● మెట్‌పల్లి : పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం మండలంలో పర్యటించినంతరం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి పాఠశాలలోని సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈయన వెంట ఇంచార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చూడాలి

బుగ్గారం: వర్షాకాలంలోని సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు పరిశుభ్రతను పాటించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి, బుగ్గారం స్పెషల్ అధికారి డీ ప్రకాశ్ అన్నారు. ఈ మేరకు బుగ్గారం మండల కేంద్రంలో అధికారులతో కలిసి మురికి కాలువలను, పలు ఇండ్లను పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాస్,ఎంపీవో అఫ్జల్ మీయా,పంచాయితీ కార్యదర్శి అక్బర్, ఆశ కార్యకర్తలు లవణ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

పెగడపల్లి: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పారిశుధ్యంపై వైద్యారోగ్య శాఖ అధికారులతో కలసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీవో మహేందర్, వైద్యాధికారి నరేష్, సీహెచ్‌వో మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

రామయ్యపల్లెలో పారిశుధ్య కార్యక్రమాలు

ధర్మపురి: మండలంలోని రామయ్యపల్లెలో గురువారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీవో రవీందర్, ఎంపీవో నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో మురికి కాలువలు శుభ్రం చేయించారు. మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడరం చల్లించారు. అలాగే మంచి నీటి బావుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి క్లోరినేషన్ చేయించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కోరుట్లరూరల్ : పరిసరాలు పరిశ్రుభ్రంగా ఉంచుకుని అంటువ్యాధులు నివారించాలని కోరుట్ల ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని నాగులపేట గ్రామంలో పారిశుధ్య పనులు పరిశీలించారు.